క్లుప్తంగా

అభివృద్ధి పనులు పూర్తి చేయండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పీవీ సిద్ధారెడ్డి

కదిరి టౌన్: అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కదిరి ఎమ్మెల్యే పీవీ సిద్ధారెడ్డి ఆదేశించారు. మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో మున్సిపల్ అధికారులతో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమ పనులపై మున్సిపల్ చైర్‌పర్సన్ పరికి నజీమున్నీషా అధ్యక్షతన సమీక్ష జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని 27 సచివాలయాలకు రూ.20 లక్షల చొప్పున రూ.5.40 కోట్లతో పనులు చేపట్టినట్లు తెలిపారు. పనులు పూర్తయిన వాటి బిల్లు అప్లోడ్ చేయాలన్నారు. వచ్చే సమావేశానికి అన్నిచోట్లా పనులు ప్రారంభించాలన్నారు. మున్సిపల్ కమిషనర్ శ్రీవారిబాబు, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



అబ్దుల్ రహిమాన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

పుట్టపర్తి: రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా పురస్కారం అందుకున్న బుక్కపట్నం బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం అబ్దుల్ రహిమాన్‌ను పాఠశాల సిబ్బంది, విద్యార్థులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలపై ఉన్న అపోహలను తొలగించి ఉత్తమ బోధనలందించాలని సిబ్బందికి సూచించారు.

క్రీడా సామగ్రి వితరణ

తలుపుల: గుండువారిపల్లి పూల వేణుగోపాల్ రెడ్డి ఉన్నత పాఠశాల విద్యార్థులకు వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసులురెడ్డి క్రీడా సామగ్రిని అందించినట్లు హెచ్ఎం విశ్వనాథరెడ్డి మంగళవారం తెలిపారు.

ఆముదం పంట పరిశీలన



ఆముదం పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు పవన్‌కుమార్‌రెడ్డి, రాధిక

బత్తలపల్లి: జ్వాలాపురంలో రైతులు సాగు చేసిన ఆముదం పంటను రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ రాధిక మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ ఐసీహెచ్-5 రకం ఆముదం విత్తనాలను గ్రామంలోని అభ్యుదయ రైతులకు ఉచితంగా అందజేశామన్నారు. ప్రస్తుతం ఆముదం ఐసీహెచ్-5లో రసం పీల్చు పురుగు వ్యాపిస్తోందని, ఇక్కడా అలాంటి పరిస్థితి ఉందోమోనని తెలుసుకునేందుకు వచ్చినట్లు తెలిపారు. అయితే అలాంటి పురుగు ఏమీ లేదన్నారు.

బైక్ జాతా జయప్రదం చేయండి

ధర్మవరం అర్బన్: యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా తలపెట్టిన బైక్ జాతాను విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి కోరారు. పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో మంగళవారం బైక్ జాతా కరపత్రాలను విడుదల చేశారు. యూటీఎఫ్ ధర్మవరం జోన్ నాయకులు రామకృష్ణనాయక్, లక్ష్మయ్య, రాంప్రసాద్, రామంజనేయులు, బి.రామంజినేయులు, సాయిగణేష్, గోపాల్‌రెడ్డి, కుళ్లాయప్ప, సకల చంద్రశేఖర్, నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం

కదిరి టౌన్: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అన్నదాన పథకానికి అన్నమయ్య జిల్లా కురబలకోట మండలం కొంగావారి పల్లి వాసి పి.శంకర్‌యాదవ్ రూ.50 వేలు విరాళంగా ఆలయ చైర్మన్ గోపాలకృష్ణకు మంగళవారం రాత్రి అందజేశారు. దాతలకు తీర్థప్రసాదాలు ,శ్రీవారి చిత్రపటాన్ని అందజేశారు.

ఆర్డీఓ కోర్టు తరలింపు సరికాదు



మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ సభ్యులు

ధర్మవరం: ధర్మవరం ఆర్డీఓ కోర్టును పుట్టపర్తికి తరలించడం సరికాదని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంపీ సుబ్బారావు, కార్యదర్శి రాఘవేంద్ర తెలిపారు. బార్ అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ధర్మవరం ఆర్డీఓ కోర్టును పుట్టపర్తికి మార్చడం సరికాదని, దీనివల్ల న్యాయవాదులతోపాటు కక్షిదారులు వ్యయప్రయాసాలకు గురికావాల్సి వస్తుందన్నారు. దీన్ని నిరసిస్తూ నాలుగు రోజుల పాటు విధులను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. ఇదే అంశంపై హైకోర్టులో రిట్ వేస్తామని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో వినాయక చవితి

ధర్మవరం అర్బన్: పట్టణంలో వినాయక చవితి పండుగ సందర్భంగా సోమవారం వాడవాడలా వినాయక విగ్రహాలు కొలువుదీరాయి. మూడురోజులు, ఐదురోజులపాటు జరుపుకునే వినాయక చవితి వేడుకల సందర్భంగా ప్రజలు భక్తిశ్రద్ధలతో వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని పలు వార్డుల్లో నెలకొల్పిన వినాయక ప్రతిమలు ఆకట్టుకున్నాయి.

తాడిమర్రి: మండలవ్యాప్తంగా వినాయక చవితి వేడకలను ఘనంగా జరుపుకున్నారు. తాడిమర్రితోపాటు పిన్నదరి, పెద్దకోట్ల, చిల్లవారిపల్లి, దాడితోట, చిల్లకొండయ్యపల్లి, కునుకుంట్ల, ఆత్మకూరు, ఎం.అగ్రహారం, చిన్నచిగుళ్లరేవు తదితర గ్రామాల్లో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు స్వాములను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

బత్తలపల్లి: వినాయక చవితి వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. మండల వ్యాప్తంగా దాదాపు 85కు పైగా విగ్రహాలను ఏర్పాటు చేశారు. మండపాలు వద్ద చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. సోమవారం సాయంత్రమే కొందరు వినాయక నిమజ్జనం చేశారు. ఇన్‌చార్జ్ ఎస్ఐ ప్రదీప్‌కుమార్ ఏఎస్ఐ సోమశేఖర్‌మూర్తి మండపాల వద్దకు చేరుకుని వివిధ అంశాలపై జాగ్రత్తలు వివరించారు.

ఎన్‌పీకుంట: మండలంలో వినాయక చవితి ఉత్సవాలను వైభవంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని చావిడి బజారులో ఓంకార గణపతి మిత్ర మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డూను వీధుల్లో మెరవణి చేశారు. అంబేడ్కర్‌నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి జెడ్పీటీసీ ఆవులశ్రీదేవి పూజలు చేశారు.



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి దంపతులు

ముదిగుబ్బ: మండల వ్యాప్తంగా సోమవారం వినాయక చవితి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మండల వ్యాప్తం 60 విగ్రహాలకు పైగా ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం వినాయకులను నిమజ్జనం చేయనున్నారు.

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి మండలం బత్తలపల్లి గ్రామంలో రాజేష్ అనే యువకుడు స్థానికంగా లభించిన చెరువు మట్టితో 6 అడుగుల వినాయకుడి విగ్రహాన్ని తయారు చేశాడు. మట్టి, కొబ్బరి నార, పేపర్లు, వాటర్ కలర్స్‌తో విగ్రహాన్ని అందంగా తయారు చేయడంతో స్థానికులు అభినందించారు.

కనగానపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాలను ప్రజలు ఉత్సాహంగా జరుపుకుంటున్నారు. సోమవారం వినాయ చవితి రోజున కనగానపల్లి, తగరకుంట, మామిళ్లపల్లి, ముక్తాపురం, కుర్లపల్లి, మద్దెలచెరువు, తదితర గ్రామాల్లో వినాయకుడి విగ్రహాలను కొలుదీర్చి భక్తులు పూజలు నిర్వహిస్తున్నారు. బుధవారం పలు గ్రామాల్లో వినాయకుడి నిమజ్జనం ఉంటుందని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

19 ఆర్‌పీడీ 101: మామిళ్లపల్లిలో వినాయకున్ని కొలువుదీర్చి పూజలు చేస్తున్న యువకులు

గాండ్లపెంట: మండలంలోని పలు గ్రామాల్లో వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించారు. వినాయక చవితి సందర్భంగా గణనాథుడిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. వినాయక నిమజ్జనం బుధవారం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పుట్టపర్తి అర్బన్: అత్యంత భక్తిశ్రద్ధలతో వినాయక చవితి వేడుకలను ప్రజలు నిర్వహించుకున్నారు. ఇందులో భాగంగానే ప్రతి ఇంట్లోనూ గౌరీదేవి పూజ చేసి నాగులకు పాలు పోయడం, పుట్టకు నూలుపోగు చుట్టడం, సమాధులను పూజించి కొబ్బరి కాయలు కొట్టడం ఆనవాయితీ. పుట్టపర్తి పట్టణంలోని వాసవీ ఆలయంలో గౌరీ నోముల వ్రతాలు ఆచరించి మహిళలకు చీర సారెలను బహుమతిగా అందజేశారు.

కదిరి టౌన్: పట్టణంలో గణనాథులు మంగళవారం కొలువుతీరాయి. వాడవాడలో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి అర్చకులతో ప్రతిష్ఠింపజేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలో దాదాపు 130 విగ్రహాల ఏర్పాటుకు పర్మిషన్ తీసుకున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు. పట్టణంలో శివాలయం, ఎర్రకోట, సింహకోట, రైల్వేగణేష్, ఆర్ఫ్‌స్ట్రీట్‌లో అతిపెద్ద విగ్రహాలు ఏర్పాటు చేశారు. శివాలయం వీధిలో 45 అడుగుల అతి పెద్ద విగ్రహం ఏర్పాటు చేశారు. ఈనెల 22న వినాయక నిమజ్జనం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

నల్లచెరువులో..

నల్లచెరువు: మండలవ్యాప్తంగా చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండపాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వినాయక కమిటీల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

వినాయకుడికి ఎమ్మెల్యే దంపతుల పూజలు

నల్లమాడ: వినాయక చవితి పర్వదినం సందర్భంగా సోమవారం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, ఆయన సతీమణి దుద్దుకుంట అపర్ణారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి స్వగ్రామం నల్లసింగయ్యగారిపల్లిలో వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ యేడు వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు, సిరి సంపదలతో రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో జీవించేలా ఆశీర్వదించాలని ఆదిదేవుడు వినాయకుడిని వేడుకున్నామన్నారు.



ధర్మవరంఅర్బన్: ఆర్యవైశ్య సత్రంలో గోవుపై శ్రీకృష్ణ వినాయకుడు



తాడిమర్రి బీసీ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం



బత్తలపల్లి వాల్మీకి కాలనీలో వెలసిన గణపయ్య



కలవలవారి వీధిలో కొలువైన వినాయకుడు



జొన్నలకొత్తపల్లిలో కొలువుదీరిన వినాయకుడు



ఎన్‌పీకుంట పీర్లచావిడి వద్ద పూజలు అందుకుంటున్న గణనాథుడు



పుట్టపర్తి మండలం బత్తలపల్లిలో మట్టితో తయారు చేసిన విగ్రహం



పుట్టపర్తి: జానకంపల్లిలో పూజలందుకుంటున్న గణపయ్య



పెదపల్లి తండాలో కొలువుదీరిన అయోధ్యరామ వినాయకుడు



పుట్టపర్తి వాసవీ ఛత్రంలో గౌరీ నోముల దృశ్యం



కొత్తచెరువు: రాయల్‌యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం



కదిరి పట్టణంలోని శివాలయంలో కొలువైన భారీ గణేశుడు



ముదిగుబ్బలో ...



కదిరి పట్టణంలో పూజలందుకుంటున్న సింహకోట వినాయకుడు

ధర్మవరం చెరువులో నిమజ్జనానికి అనుమతి లేదు

ధర్మవరం అర్బన్: ప్రజల భద్రత దృష్ట్యా ధర్మవరం చెరువులో వినాయక నిమజ్జనానికి అనుమతి లేదని వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం వినాయక కమిటీల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గొట్లూరు వాగు, కుణుతూరు వంక, రేగాటిపల్లి చెరువు, సంగాల వాగుల్లో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసుకోవాలని సూచించారు. చిన్నపిల్లలు, ఈతరానివారిని నిమజ్జనానికి వెంట తీసుకొని వెళ్లరాదన్నారు. నిమజ్జనం ప్రదేశంలో పోలీసు బందోబస్తు ఉంటుందని తెలిపారు.

ఇద్దరికి తీవ్ర గాయాలు

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం జానకంపల్లి వద్ద సోమవారం రాత్రి ఆటో .. ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. కర్నాటకనాగేపల్లికి చెందిన వడ్డె వెంకట్రాముడు, అతని, భార్య మనుమరాలు కీర్తితో కలసి వినాయక చవితి సందర్భంగా బైక్‌పై బుక్కపట్నం బయలుదేరారు. జానకంపల్లి వద్దకు రాగానే అదే గ్రామానికి చెందిన రమేష్ అనే వ్యక్తికి చెందిన ఆటో ఢీ కొట్టింది. వెంకట్రాముడి , కీర్తికి తీవ్రగాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

అమడగూరు: అధైర్య పడొద్దు అండగా ఉంటానని బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి భరోసా ఇచ్చారు. అమడగూరుకు చెందిన సైపుల్లా (38) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఎమ్మెల్యే సోమవారం గ్రామానికి చేరుకుని సైపులా మృతదేహం వద్ద నివాళులర్పించి, మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే హరిపురానికి చెందిన రమేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఎమ్మెల్యే గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందించారు. వైఎస్సార్‌సీపీ సీఈసీ మెంబర్ సోమశేఖర్‌రెడ్డి, నాయకుడు చక్రధరరెడ్డి మంగళవారం అమడగూరుకు చేరుకుని సైపుల్లా కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఆర్థికసాయం అందజేసి, మృతుని కుమార్తెని చదివిస్తామని హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి, సర్పంచ్ షబ్బీర్, తదితరులు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్య

తనకల్లు: అప్పుల బాధ తాళలేక సురేష్ (34) అనే రైతు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మరాళ్లపల్లిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రాంభూపాల్ తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన సురేష్ తన ఐదు ఎకరాల పొలంలో వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అయితే పంట సాగు కోసం దాదాపు రూ. 3 లక్షలు వరకు అప్పు చేశాడు. పంట సాగుచేయడంతో నష్టాలు రావడంతో చేసిన అప్పు ఎలా తీర్చాలో అర్థం కాక సోమవారం తెల్లవారుజామున ఇంట్లో ఉరి వేసుకున్నాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గడప గడపలో ఆనందం



గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మహిళకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నల్లమాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తోనే సంక్షేమ పాలన సాధ్యమని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని దొన్నికోట పంచాయతీ దొన్నికోట, డీ.చెర్లోపల్లి గ్రామాల్లో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరిస్తూనే స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి అక్కడికక్కడే చర్యలు తీసుకున్నారు. గతానికి భిన్నంగా ప్రస్తుత ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు నేరుగా నేరుగా తమకు అందుతున్నాయని, ప్రతినెలా 1వ తేదీనే వలంటీర్లు ఇంటికొచ్చి పింఛన్ ఇస్తున్నారని పలువురు లబ్దిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. 600లకు పైగా అబద్ధపు హామీలతో ప్రజలను మభ్యపెట్టి 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఏ ఒక్కటీ నెరవేర్చకపోగా అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని విమర్శించారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కే సొంతమన్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 25 వేల పక్కా గృహాలు మంజూరు చేశామని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఇల్లు నిర్మించుకోవాలని ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి సూచించారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక



ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్న టీడీపీ కార్యకర్తలు

టీడీపీ సీనియర్ కార్యకర్తలు దొన్నికోటకు చెందిన తలారి నరసింహులు, డీ.చెర్లోపల్లికి చెందిన బచ్చు వెంకట్రాముడు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే వారికి కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ డుంగావత్ సునీతా బాయి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కుళ్లాయినాయక్, దొన్నికోట సర్పంచ్ రాగినేని సరస్వతి, పాల ఏకిరి కార్పొరేషన్ డైరెక్టర్ కుళ్లాయమ్మ, మండల ఉపాధ్యక్షురాలు ఉత్తమ్మ, సింగిల్‌విండో డైరెక్టర్ గోపాల్‌నాయుడు, మండల కో ఆప్షన్ సభ్యులు మహమ్మద్ రసూల్, మాజీ సర్పంచ్ ఆదినారాయణ, ఎస్.రాంమోహన్‌రెడ్డి, నాయకులు నాగరాజునాయుడు, కమలార్‌నాయుడు, బాలాజీనాయుడు, గోపాల్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

22న కదిరిలో గణేష్ నిమజ్జనం

కదిరి: ఈనెల 22న కదిరిలో వినాయక నిమజ్జనం ఉంటుందని డీఎస్పీ ఎం.శ్రీలత పేర్కొన్నారు. మంగళవారం డీఎస్పీ తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. ఇటీవల నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో ఉత్సవ కమిటీ సభ్యులు నిమజ్జనం ఆదివారం (24న) నిర్వహించేందుకు అవకాశం కల్పించాలని కోరారని, అయితే అదే రోజు జిల్లాలో మరోచోట నిమజ్జనం ఉన్నందున పోలీస్ యంత్రాంగం అక్కడికి వెళ్లాల్సి ఉందన్నారు. ఎప్పటిలాగానే కదిరిలో 5వ రోజు నిమజ్జనం చేసేందుకు జిల్లా అధికారులు సూచించారన్నారు. ఆరోజు ఉదయం 11 గంటల్లోపు విగ్రహాలన్నీ మండపాల నుంచి కదిలించాలని, మధ్యాహ్నం 1 గంటకు స్థానిక రైల్వే స్టేషన్ నుంచి వినాయకుడి శోభాయాత్ర ప్రారంభమవుతుందన్నారు. నిమజ్జనం ప్రశాంతంగా జరిగేందుకు అన్ని రాజకీయ పార్టీలతో పాటు అన్ని మతాల వారు సహకరించాలని కోరారు.

డ్రిప్పు వైరు చోరీ

ముదిగుబ్బ: ఎనుములవారిపల్లిలో రైతు నారాయణస్వామికి చెందిన వ్యవసాయ తోటలో రూ.2 లక్షల విలువ చేసే డ్రిప్పు వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ మేరకు మంగళవారం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సంక్షిప్త సమాచారం

ఓటరు సర్వే పరిశీలన

బత్తలపల్లి: మండల కేంద్రంలో బీఎల్ఓలు చేపట్టిన ఓటరు సర్వేను తహసీల్దార్ యుగేశ్వరిదేవి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బీఎల్ఓలు డబుల్ ఎంట్రీలు, మృతి చెందిన ఓటర్ల తొలగింపుపై విచారణ చేపట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బీఎల్ఓలు ఎలాంటి పొరబాట్లకు అవకాశం ఇవ్వకుండా పకడ్బందీగా కసరత్తు నిర్వహిస్తున్నారన్నారు. ఆమె వెంట వీఆర్ఓ ప్రతాప్, బీఎల్ఓలు రాజా, నరసింహులు తదితరులు ఉన్నారు.

గణేష్ నిమజ్జనానికి ఏర్పాట్ల పరిశీలన

ప్రశాంతి నిలయం: పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలో బుధవారం నిర్వహించనున్న గణేష్ నిమజ్జనానికి సంబంధించి ఏర్పాట్లను అధికారులు, పాలక మండలి సభ్యులు మంగళవారం పరిశీలించారు. కర్నాటక నాగేపల్లి సమీపంలోని సాహెబ్ చెరువు, ఎనుములపల్లి చెరువులను అధికారులు పరిశీలించి అక్కడ చేపట్టాల్సిన ఏర్పాట్లను చర్చించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వీరేష్, మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి గణేష్ మంటపాల నిర్వాహకులకు పలు సూచనలు, సలహాలిచ్చారు. సాయంత్రం 6 లోపలే నిమజ్జనం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎనుములపల్లి చెరువుకు సమీపంలోని విగ్రహాలను అక్కడి చెరువులో, సాహెబ్ చెరువుకు సమీపంలోని విగ్రహాలను సాహెబ్ చెరువలో నిమజ్జనం చేయాలన్నారు. మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబులపతి, వైస్ చైర్మన్ తిప్పన్న పాల్గొన్నారు.

ఉపాధి పనులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

తనకల్లు: ఉపాధిహామీ పనులపై సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని డ్వామా పీడీ రామాంజనేయులు హెచ్చరించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉపాధిహామీ పనులపై ప్రజా వేదిక నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 2022-23లో ఉపాధి హామీ పనుల కోసం రూ.3.70 కోట్లు ఖర్చు పెట్టినట్లు తెలిపారు. ఇందులో రూ. 52 వేలు అవినీతి జరిగినట్లు సామాజిక తనిఖీ సభ్యులు తెలిపారు. విజిలెన్స్ అధికారి రమణారెడ్డి, ఎంపీడీఓ పూల నరసింహులు, ఏపీఓ మరియమ్మ ఉన్నారు.

నల్లచెరువు: జాతీయ ఉపాధి హామీ ద్వారా స్థానిక కస్తూరిబాయి ఆదర్శ పాఠశాలలో చేపట్టిన (రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్) నీటిని నిల్వ చేయు కుంటల పనులను డీడబ్ల్యూఎంఏ పీడీ రామాంజనేయులు మంగళవారం పరిశీలించారు. ఎం.అగ్రహారం గ్రామంలోని శివమ్మ అనే రైతు పొలంలో హార్టికల్చర్ కింద సాగు చేసిన మామిడి మొక్కలను, అదే గ్రామానికి చెందిన రైతు సూర్యనారాయణరెడ్డి పొలంలో చీనీ మొక్కలను పరిశీలించారు.

'జగనన్న సురక్ష'పై అవగాహన

గాండ్లపెంట: రెక్కమాను గ్రామ సచివాలయంలో ఎంపీడీఓ రామానాయక్ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య సిబ్బంది వలంటీర్లకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జగనన్న ఆరోగ్య సురక్ష బ్రోచర్లు విడుదల చేశారు. మండల కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి, మండల వ్యవసాయ సలహా కమిటీ అధ్యక్షుడు శంకర్‌నాయుడు, బీసీ కన్వీనర్ జక్కల నరసింహగౌడ్, సచివాలయ కన్వీనర్ ఖాజావలీ పాల్గొన్నారు.